ప్రజాశక్తి
గురువారం 13 ఏప్రిల్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఇసుక దందాకు కళ్లెం పడేనా?

కొనసాగుతున్న అక్రమార్కుల ఆధిపత్యం - ఎన్‌జిటి ఫిర్యాదులపై రాజకీయ దుమారం



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అమరావతి వద్ద కృష్ణానదిలో రహదారులు నిర్మాణం కలకలం రేపింది. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, దీని వల్ల వేలాది మంది ప్రాణాలకు నష్టం జరుగుతుందని పరోక్షంగా ఇది హత్య చేయడమేనని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ధర్మాసనం గతంలోనే వ్యాఖ్యానించినా పల్నాడు జిల్లా యంత్రాంగం చూసిచూడనట్టు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇసుక పంపిణీ ఒక ఫార్సుగా మారింది. జిల్లాలోని నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న రీచ్‌ల నుంచి భారీగా ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఇసుక తవ్వకం, రవాణా ఛార్జీలతోపాటు ఆయా ప్రాంతాల్లో ఆధిపత్యం వహించే నేతల అనుచరులు ఎక్కువగా ఇసుకను అక్రమ మార్గంలో విక్రయిస్తున్నారు. ఈ విషయంలో అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. నదీ గర్భంలోనే ఇసుకను ప్రొక్లెయినర్ల ద్వారా తవ్వుతున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని పలు రీచ్‌ల నుంచి ఇసుకను తెలంగాణ ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక లారీల వల్ల పలు గ్రామాల్లో రహదారులు ఛిద్రమైపోతున్నా ఏ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

కొంత కాలంగా నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుకతవ్వకాలు చేపట్టారు. నదీగర్భంలో ఇసుక తవ్వకాలు జరగడం వల్ల ఎక్కడికక్కడ ఊబిలు ఏర్పడుతున్నాయి. దీంతో విహార యాత్రకు వచ్చిన అనేక మంది విద్యార్థులు, యువకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అమరావతి, తాడేపల్లి ప్రాంతంలో తరచూ యువకులు నదిలోని ఊబిలో పడి మృత్యువాత పడుతున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో నదీగర్భానికి చేరువగా తవ్వొద్దనే నిబంధనలను పట్టించుకోవడం లేదు. వైకుంఠపురం, ధరణికోట, అచ్చంపేట మండలం కోనూరు, కస్తల, చింతపల్లి (కొత్తపలి) తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయి.

జిల్లాలో గతంలో జెపి ఇన్‌ఫ్రా సంస్థ ఇసుక విక్రయాలు నిర్వహించింది. ఈ సంస్థ రికార్డులో మాత్రమే ఉండగా అనధికారికంగా జిల్లాకు చెందిన ఒక ప్రజా ప్రతినిధికి ఇసుక విక్రయాల బాధ్యతను అప్పగించారు. అమరావతి ప్రాంతంలో కృష్ణానదిలో నదీ ప్రవాహాన్ని నిలుపుదలకు వేసిన రోడ్ల వ్యవహారంపై ఎన్‌జిటికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ అంశంలో టిడిపి, వైసిపి రెండు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. మీ హయాంలోనే ఎక్కువ అక్రమాలు జరిగాయంటే మీ హయాంలోనే జరిగాయని ఇటీవల పరస్పర విమర్శలతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ రాజకీయ ఆరోపణలతో అమరావతిలో వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో టిడిపి నాయకులు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై పలు ఆరోపణలు చేశారు. ఇసుక ▶ 2లో



డీఎస్సీ 1998 అభ్యర్థుల ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

తమకు న్యాయం చేయాలని కోరుతూ డిఎస్‌సి 1998 అభ్యర్థులు బుధవారం గుంటూరు డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. జిల్లాలో విల్లింగ్ ఇచ్చిన అభ్యర్థులందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇవ్వాలని కోరుతూ గేటు ఎదుట నిరసన తెలిపారు. జిల్లాలో 788 మంది అభ్యర్థులు విల్లింగ్ లెటర్లు ఇచ్చారు. అయితే బుధవారం 229 పోస్టులకు మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో మిగిలిన 559 మందికి అన్యాయం జరుగుతుందని, న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. అభ్యర్థులందరికీ ఉద్యోగాలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, కానీ ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం పోస్టులు ఇస్తున్నారని, అందువల్ల మిగిలిన వారికి అన్యాయం జరుగుతుందన్నారు. రోస్టర్ పాటించకపోవటం వల్ల రిజర్వేషన్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ కమ్ మెరిట్ విధానం పాటించాలని కోరారు. ఈ సందర్భంగా డిఇఒ శైలజ, డిప్యూటీ డిఇఒ సుధాకర్‌రెడ్డి అభ్యర్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులు అభ్యర్థులను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించారు. అభ్యర్థుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కాగా 1998 డిఎస్‌సి అభ్యర్థులకు నిర్వహించిన కౌన్సెలింగ్‌ను డిఇఒ శైలజ, డిప్యూటీ డిఇఒ సుధాకర్‌రెడ్డి, ఉర్దూ డిఐ ఖాసిం, హెచ్‌ఎంలు పర్యవేక్షించారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు



ఎమ్మెల్సీలుగా రాజశేఖర్, ఏసురత్నం

ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎమ్మెల్సీలుగా మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసన మండలిలో చైర్మన్ కొయ్యే మోషన్ రాజు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, మండలిలో చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, ఇంకా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. తొలుత భారీ ర్యాలీతో మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం గుంటూరు నుంచి వెలగపూడికి తరలివెళ్లారు.



గుంటూరులో మాకినేని బసవపున్నయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బసవపున్నయ్య స్ఫూర్తితో ప్రజాపోరాటాలు

వర్ధంతి సభల్లో సిపిఎం నాయకులు - పలు చోట్ల ఘన నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎం అగ్రనాయకులు, పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు, మార్క్సిస్టు సిద్ధాంతకర్త మాకినేని బసవపున్నయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలను విస్తృతం చేయాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం మాకినేని బసవపున్నయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె ప్రాంతంలోని తూర్పు పాలెంలో జన్మించిన బసవపున్నయ్య జాతీయోద్యమ స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారన్నారు. తన జీవితాంతం కష్టజీవుల ఉద్ధరణ కోసం పాటుపడ్డారని, కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన అతివాద, మితవాద విచ్ఛిన్నకర ఉద్యమాకుల వ్యతిరేకంగా నిలిచి సిపిఎంను బలోపేతం చేయడంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ సిపిఎం కార్యక్రమాన్ని, ఎత్తుగడల పంథాను రూపొందించడంలో బసవపున్నయ్య కీలకపాత్ర పోషించారన్నారు. మార్క్సిజాన్ని ▶ 2లో

గుంటూరు ఛానల్ విస్తరణకు పోరాటం ఉధృతం

15న కలెక్టరేట్ ఎదుట ధర్నా - రైతు, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం 8లో

బైపాస్ కోసం ఎమ్మెల్యే దీక్ష

నిర్మాణ సంస్థ హామీతో విరమణ మెయిన్‌లో



కడుపులో ట్యూమర్ తొలగింపు

జిజిహెచ్‌లో అరుదైన, క్లిష్టమైన చికిత్స మెయిన్‌లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సాయంత్రం) : 6.28

సహరీ (శుక్రవారం ఉదయం) : 4.37

ఇసుక దందాకు కళ్లెం పడేనా?

(మొదటి పేజీ తరువాయి)

విక్రయాలతో తనకు సంబంధం లేదని జెపి సంస్థవారే ఇసుక విక్రయాలుచేస్తున్నారని శంకరరావు ఇటీవల ప్రకటించారు. కానీ శంకరరావు కనుసన్నల్లోనే జరుగుతుందని రాజకీయ వర్గాలో ప్రచారం జరుగుతోంది.

ఈ పరిస్థితుల్లో ఎన్‌జిటికి ఫిర్యాదులు వెళ్లిన విషయం తెలిసినా విక్రయదారుల్లో మార్పురాలేదు. ఎన్‌జిటి అధికారులు స్వయంగా పరిశీలించేందుకు త్వరలో అమరావతి ప్రాంతానికి వచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. మరోవైపు ఇసుక ధరలు కూడా ఇంకా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకు ఇసుక దొరకడం లేదు. రవాణా ఛార్జీలు, ఇతర ఖర్చులు కలిపి టన్ను రూ.వెయ్యి పైన పలుకుతోంది. అమరావతి నుంచి గుంటూరుకు 10 టన్నుల లారీ ఇసుక కావాలంటే రూ.10 నుంచి రూ.12 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. కానీ ప్రభుత్వం రూ.475కి టన్ను ఇసుక విక్రయించాలని చెబుతోంది. ఆచరణలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ విద్యా అధ్యయన కేంద్రం వారి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో ముందస్తుగా అంబేద్కర్ జన్మదినవేడుకలను బుధవారం నిర్వహించారు. విశిష్ట అతిధిగా రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఐఎఎస్ కరికల్ వలవెన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పౌరుని నైతికాబివృద్ధే నిజమైన దేశాభివృద్ధిగా అంబేద్కర్ భావించేవారని తెలిపారు. సమాజంలో వర్ణ, వర్గభేదాలు ఉండొద్దని రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా రూపొందించి ఎందరికో ఆరాధ్యుడయ్యారని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఏకాగ్రతతో చదివి మంచి భవిష్యత్తును పొందాలని తెలిపారు. మరో ముఖ్య అతిధి మద్రాసు విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల భాషా విభాగానికి చెందిన ఆచార్య ఎస్. ఆర్మ్ స్ట్రాంగ్ మాట్లాడుతూ భారతదేశంలో భారీ ఆనకట్టల సాంకేతికత విషయంలో అంబేద్కర్ ముఖ్యమైన పాత్ర పోషించారని హిరాకుడ్, దామోదర్, సోన్ రివర్ డ్యామ్ ప్రాజెక్టులను ప్రారంభించడంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 7వ సెషన్‌లో బాబాసాహెబ్ భారతదేశంలో పని గంటల సంఖ్యను 14 నుంచి 8 గంటలకు తగ్గించారన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ సామాజిక వ్యవస్థను మార్చడం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నతుడు అని తెలిపారు. కార్యక్రమానికి అంబేద్కర్ విద్య అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య వై.అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. డా. అబ్రహం లింకన్ , విశ్వ విద్యాలయ బోధన బోధనేతర సిబ్బంది, వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గోరిపర్తి రామరాజు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

మండలంలోని గాయంవారిపాలెం గ్రామ టిడిపి సీనియర్ నాయకులు గోరిపర్తి రామరాజు మృతి చెందారు. బుధవారం వారి స్వగహంలో వారి బౌతిక కాయాన్ని టిడిపి మాజీ ఎమ్మెల్యే సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు ,మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, గ్రామ నాయకులు గోరిపర్తి వెంకటేశ్వరరావు, మున్నగి సుబ్బారెడ్డి, ఈమని సుధాకర్ రెడ్డి,పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తెనాలి

వృద్దుని అంత్యక్రియలకు ఆదిత్య రెస్టారెంట్ అధినేత వేముల రామకృష్ణ ఆర్థిక సాయాన్ని అందించారు. స్థానిక నాజరుపేటకు చెందిన వావిలాల మోహనరావు బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేయలేని స్థితిలో ఉండగా సత్యం శివం సుందరం సామాజిక కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్‌ను ఆశ్రయించారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న రామకృష్ణ స్పందించి అంత్యక్రియలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందించారు.

24,501 మందికి ఇబిసి నేస్తం



లబ్ధిదారులకు చెక్కు అందచేస్తున్న కలెక్టర్ తదితరులు


ప్రజాశక్తి-గుంటూరు

ఈబీసీ నేస్తం క్రింద జిల్లాలో 24,501 మంది ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల పేద మహిళకు రెండవ విడతగా 2022 -23 సంవత్సరానికి రూ. 36,75,15,000లు ఆర్థిక సాయం అందించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి వైయస్సార్ ఈబీసీ నేస్తం ఆర్థిక సాయాన్ని వర్చువల్ విధానం ద్వారా బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమంలో గుంటూరు కలక్టరేట్ నుండి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ యం. పురుషోత్తం, మార్కెటింగ్ శాఖ చైర్ పర్సన్ వై. భాగ్యలక్ష్మీ, డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈబీసీ నేస్తం ద్వారా 45 నుండి 60 ఏళ్ళలోపు ఉన్న అగ్రవర్ణపేద మహిళలకు 2021-22లో 21,530 మందికి మొదటి విడతగా రూ.32.30 కోట్లు, 2022-23లో 24,501 మందికి రూ.36.37 కోట్లు మొత్తం 46,031 మందికి రూ.69.05 కోట్లు వారి ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. కార్యక్రమం అనంతరం లబ్దిదారులకు మెగా చెక్కు అందచేశారు.

సచివాలయాలను నిరంతరం పర్యవేక్షించాలి

గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు మెరుగుపర్చటంలో, పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించే ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు.బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల అధికారులు, ప్రత్యేక అధికారులు సచివాలయాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుతున్న సేవలను పర్యవేక్షించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సంబంధిత సచివాలయ ఉద్యోగులు ప్రతినెలా తనిఖీలు నిర్వహించేలా పర్యవేక్షించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను వెంటనే ప్రారంభించాలని, పూర్తి అయిన పనులకు వెంటనే బిల్లులు అప్లోడ్ చేయాలన్నారు.అలాగే పేదలందరికీ ఇళ్ళ పథకం, ఎస్డీజీ గోల్స్‌కు సంబంధించి, బడి బయట ఉన్న పిల్లల్ని బడిలో చేర్పించటం, వ్యవసాయ యంత్ర పరికరాల గ్రౌన్డింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో కలెక్టరేట్ నుండి డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ రామిరెడ్డి, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్.శ్రావణబాబు తదితరులు పాల్గొన్నారు.





బసవపున్నయ్య స్ఫూర్తితో ప్రజాపోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

మన దేశ పరిస్థితులుకు అన్వయించి పార్టీ అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్ వంట గ్యాస్ ధరలు పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, భారత రాజ్యాంగ మౌళిక సూత్రాలను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఈ స్థితిలో బసవపున్నయ్య స్ఫూర్తితో ఉద్యమించడమే వారికి నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ పొలిట్‌బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్, ప్రజాపోరు జిల్లా నాయకులు కొటేశ్వరరావు, ఎంసిపిఐ (యు) నాయకులు కె.శ్రీధర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, నల్లమడ రైతు సంఘం నాయకులు ఎన్.ఆచారి, కె.హరిబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మాకినేని బసవ పున్నయ్య కీలకపాత్ర పోషించారని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య అన్నారు. స్థానిక పుతుంబాక భవన్లో నిర్వహించిన వర్ధంతి సభలో బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ స్వాతంత్ర అనంతరం భారతదేశంలో విప్లవ పంథా ఎలా ఉండాలి అనే దానిపై కార్యక్రమాన్ని రూపొందించిన వారిలో మాకినేని బసవ పున్నయ్య ఒకరని అన్నారు. 12 ఏళ్ల రాజ్యసభ సభ్యులుగా పనిచేసి అఖిలభారత రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, మండల కార్యదర్శి పి.మహేష్, నాయకులు కె.శివదుర్గా రావు, జి.బాలకృష్ణ, జి.రజిని, జె.రాజకుమార్, సిపిఐ నాయకులు నరిశేటి వేణుగోపాల్, ఇర్మియ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఫిరంగిపురం : మండలంలోని పొనుగుపాడులో వర్ధంతి సభకు జివి రావు అధ్యక్షత వహించగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.ఎం.వలి మాట్లాడారు. ఖాజా, మస్తాన్‌వలి, హరిబాబు, కోటేశ్వరరావు, ఫణి కుమార్ పాల్గొన్నారు.

గాంధీ పార్క్ పనుల తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు



గుంటూరు నగరానికి తలమానికంగా, ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చేలా గాంధీ పార్కును అభివృద్ధి చేస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. పెండింగ్ పనులను ఇంజినీరింగ్ అధికారులు వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. బుధవారం కమిషనర్ గాంధీపార్కు పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్కుల్లో చిన్న పిల్లల నుండి పెద్ద వాళ్ల వరకు ప్రతి ఒక్కరికీ ఆహ్లాదాన్ని అందించేలా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పార్క్‌లో ఆకర్షణీయంగా ఉండేలా ఏర్పాటు చేయనున్న కళాకతులను మరింత సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పార్క్‌లో చేపట్టిన పనులు కొంత జాప్యం జరుగుతుందని, వాటిని నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పచ్చదనం పెంపు పై ఏ.డి.హెచ్. మరింత దష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈ.ఈ.లు కోటేశ్వరరావు, కొండారెడ్డి, సుందర్రామిరెడ్డి, డి.ఈ.ఈ. శ్రీనివాసరెడ్డి, ఏడిహెచ్ రామారావు, ఏ.ఈ.లు రాంబాబు, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆర్కే పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలు 14వ వార్డులోని ముగ్గురోడ్డు పాఠశాలలో బుధవారం నిర్వహించారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణు గోపాలసోమిరెడ్డి విద్యార్థుల మధ్య కేక్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముదికొండ ప్రకాష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎం.వెంకటరామిరెడ్డి, ఎం.పండు, డి.దాసు, శ్రీనివాస మధు, యు.శ్రీను, కె.ఉదయరాజు, జోషి, రవి, ప్రభాకర్, తిరుమలమ్మ, నాని, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి రూరల్: ఎమ్మెల్యే ఆళ్ళ రామకష్ణారెడ్డి జన్మదిన సందర్భంగా మంగళగిరి ఫోటోగ్రాఫర్స్,వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఎమ్మెల్యే ఆర్కేని నిడమర్రు టిడ్కోగృహాల వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నందం వీరాంజనేయులు (బుజ్జి), గోలి శివకుమార్, అధ్యక్షుడు మర్రెడ్డి శివనాగిరెడ్డి, ఉపాధ్యక్షులు పడాల అనిల్ కుమార్, కార్యదర్శి కొండా అభిరామ్, కృష్ణారెడ్డి, కోశాధికారి పల్లె ప్రకాష్, సహాయ కార్యదర్శి చింతపల్లి కన్యాకుమార్, కమిటీ మెంబర్ కాజా పున్నారావు, ప్రసాద్ యూనియన్ సభ్యుడు నూతలపాటి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న వైసిపి నాయకులు ,తదితరులు

మంగళగిరి:మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలు బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. వైసిపి నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైసీపీ పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి, వైసిపి నాయకులు ఎండి ఫిరోజ్, సంకే సునీత, ఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు: వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎండీ ఫయాజ్ అహ్మద్‌కు అలహాబాద్‌లోని మోతిలాల్ నెహ్రూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని విజ్ఞాన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ' డెవలప్‌మెంట్ ఆఫ్ స్మార్ట్ క్వాడ్‌కాప్టర్ ఫర్ ఇనెస్పెక్షన్ ఆఫ్ ఓవర్‌హెడ్ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్స్' అనే అంశంపై పరిశోధన చేశారన్నారు. ఈయనకు ఎన్ఐటీ అలహాబాద్‌లోని మెకానికల్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ జేసీ మొహంతా గైడ్‌గా వ్యవహరించారన్నారు. ఫయాజ్‌కు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని నుదురుపాడుసమీపంలో కల్వర్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని రాంగ్ రూట్ లో అతివేగంగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఎదురుగా ఢీ కొట్టిన ఘటనలో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ప్రమాదం బుధవారం ఉదయం 10 గంటల సమయంలో జరిగింది. నరసరావుపేట వైపు నుండి గుంటూరు వైపు వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఈపూరు మండలం గుండేపల్లికి చెందిన నాగరాజు నడుపుతున్నాడు. అతని వెనుక నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే హెడ్ కానిస్టేబుల్ తాళ్లూరి సూర్యనారాయణ కూర్చున్నాడు. కల్వర్టుపై వస్తున్న వీరి మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న వాహనం తన ముందు వాహనాన్ని క్రాస్ చేసే క్రమంలో అతివేగంగా రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో కల్వర్టుపై నుంచి సూర్యనారాయణ ఎగిరి కింద పడటంతో తీవ్రగాయాల య్యాయి. తీవ్ర గాయాల పాలైన సూర్యనారాయణ, నాగరాజులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో సూర్య నారాయణ మృతి చెందాడు. నాగరాజుకు వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఈ ప్రమాద ఘటనపై ఫిరంగిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూర్యనారాయణ మృతదేహానికి పోస్ట్‌మార్టం అనంతరం ఆయన సొంతూరు మేరికపూడికి తీసుకువెళ్లారు. హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి నరసరావుపేట డిఎస్పి సిహెచ్ విజయభాస్కర్, రూరల్ సిఐ భక్త వత్సలరెడ్డి, ఎస్ఐ ఇ.బాల నాగిరెడ్డి, పల్నాడు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. మాణిక్యాలరావు నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబానికి రూ.25 వేలను డిఎస్పి అందజేశారు.



హెడ్‌కానిస్టేబుల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పెదకూరపాడు



గ్యాస్ లీకై కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుడు గంగోత్రి ఏసురత్నం మృతి చెందిన సంఘటన పెదకూరపాడులో బుధవారం ఉదయం జరిగింది. అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్యాస్ లీకై ఇల్లంతా వ్యాపించిందని, టీ పెట్టేందుకని స్టౌ వెలిగి స్తుండగా మంటలు వ్యాపిం చాయి. మంటలను ఆర్పే క్రమం లో గాయపడ్డ ఏసురత్నంను ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అప్పటికే ఒంటినిండా బొబ్బలు వచ్చిన ఆయనకు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు.

రోడ్డు పక్కన వృద్ధుడి మృతదేహం

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిలోని సాతులూరులో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు నాదెండ్ల ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపారు. మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని నరసరావుపేట వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాదెండ్ల ఎస్ఐ భాస్కర్ తెలిపారు.

ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్టులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చినకాకాని వై జంక్షన్ వద్ద గల ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం మంటలు చెలరేగాయి. బ్యాటరీల నుండి గ్యాస్ లీకై కార్యాలయంలో పొగ అవరించింది. అక్కడి సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పొగ బయటకు వెళ్లేలా కార్యాలయ అద్దాలు పగలగొట్టారు. ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడం తో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



తిరుణాళ్లలో అన్నదానం

ప్రజాశక్తి - వినుకొండ

శ్రీ మందమంచిపాటి వీరాంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రతి ఏటా అన్నదానం కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చెప్పారు. వినుకొండ మండలం మదమంచిపాడులోని శ్రీ వీరాంజనేయస్వామి తిరుణాళ్లను పురస్కరించ కుని ఇక్కడి మక్కెన చిన్నారమయ్యా క్రీడ ప్రాంగణంలో జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇక్కడికి వచ్చే రైతులతో పాటు ఎడ్ల బల ప్రదర్శనను తిలకించేందుకు వచ్చే ప్రేక్షకులకు ఉచితంగా అన్నదానం కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. 2006 నుండి ఈ కార్యక్రమాన్ని తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోటప్ప నగర్ సర్పంచ్ ఎన్.శ్రీనివాసరెడ్డి, జంగాలపల్లె సర్పంచ్ బుడ్డయా, జి.గురునాథం, రెడ్డి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జ్ లకు, బూత్ లెవల్ కన్వీ నర్లకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు దిశా నిర్దేశం చేశారు. టిడిపి సమీక్ష సమావేశాల్లో భాగంగా బుధవారం స్థానిక పండరీపురంలోని తన నివాసంలో క్లస్టర్(8) పఠాన్ సమద్ ఖాన్, క్లస్టర్ (11)మద్దిబోయిన శివ నేతృత్వంలో యూనిట్ ఇన్‌ఛార్జ్ లు, బూత్ కన్వీనర్ తో పుల్లారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో టిడిపి బూత్ కన్వీనర్లు యాక్టివ్ గా ఉండాలని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి బూత్ కన్వీనర్ తమ పరిధి లోని ఓట్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, ఓట్లను తొలగిస్తే కనుక అధికారులకు ఫిర్యాదు చేసి, వాటిని మళ్లీ అదే పోలింగ్ బూత్ లోకి వచ్చే విధంగా చూడాలని తెలిపారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి', ఓటర్ల పరిశీలన, హౌస్ మ్యా పింగ్ సహా ఇతర కార్యక్రమాల్లో పుంజుకోవాలని వారికి చెప్పారు. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని, 2022 ఓటర్ల జాబితాలే కాదు! 2023 జాబితాను సరిచూసుకోవాలని అన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రజలలో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	1,15,410
మిర్చి ఎగుమతి	:	1,14,880
మిర్చి నిల్వ	:	90,186

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,500 - 24,000
నెం.5	12,000 - 21,000
273	10,500 - 21,500
341	10,000 - 25,000
4884	21,500 - 22,000
సూపర్ 10	11,000 - 21,500
నాన్ ఎసి	
తేజ	9,000 - 23,000
బడిగి	11,000 - 26,000
దేవనూరు డీలక్స్	10,000 - 22,000
తాలుకాయలు	5,000 - 13,000



చర్లగుడిపాడు దళితులతో మాట్లాడుతున్న వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి లక్ష్మీశ్వరరెడ్డి తదితరులు

చర్లగుడిపాడు దళితుల భూ సమస్యపై హైకోర్టు తీర్పు అమలు చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-నరసరావుపేట

గురజాల మండలం చర్లగుడిపాడు దళితుల భూ సమస్యపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్లగుడిపాడు రెవెన్యూ గ్రామానికి చెందిన 645,646,647 సర్వే నంబర్లలోని సుమారు 300 ఎకరాలు ప్రభుత్వ భూమిని తరతరాలుగా చర్లగుడిపాడు దళిత రైతులు సాగు చేసుకుంటున్నారు. కాగా జంగమేశ్వరపురానికి చెందిన ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, విత్తన పరిశోధనా సంస్థ కొన్ని ఏళ్లుగా దళితులపై దౌర్జన్యం చేస్తూ, క్రిమినల్ కేసులు పెట్టి బెదిరిస్తూ, దళిత రైతుల సాగు అనుభవ హక్కులకు ఆటంక పరుస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డితో కలిసి చర్లగుడిపాడుని సందర్శించారు. దళితుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా విత్తన సంస్థకు గురజాల గ్రామ రెవెన్యూ లోని పట్టా నంబర్ 5227 లో కేవలం 23 ఎకరాలే కొనుగోలు చేసి ప్రభుత్వం కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ సంస్థకు ఏమాత్రం సంబంధంలేని చర్లగుడి పాడు రెవెన్యూలోని ప్రభుత్వ భూమిని దళితులు అనుభవించకుండా ఆటంకపరచడం అన్యాయమన్నారు. ఈ విష యమై లబ్ధిదారులు హైకోర్టులో రిట్ పిటిషన్ నెం. డబ్ల్యు పి. 28985 ఆఫ్ 2015 ద్వారా కేసు వేయగా గతేడాది నవంబర్‌లో హైకోర్టు దళితులకు అనుకూలంగా భూములకు అసైన్మెంట్ పట్టాలు, పాస్ పుస్తకాలు ఇచ్చి వారి హక్కులను కాపాడాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. లబ్ధిదారులు ఈ విష యమై కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ఆలకించడంలేదని, ఈ పరి స్థితుల్లో భూముల్లోకి వెళ్లి ప్రత్యక్ష కార్యాచరణకు దిగడం, మళ్లీ కోర్టు తీర్పు అమలు చేయాలని హైకోర్టును ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదని దళితులకు చెప్పారు. కార్యక్రమంలో భూపోరాట కమిటీ సభ్యులు పి.ఆదాం, కె.అక్కులు, పి.మరియదాసు, బి.సువర్ణ బాబు, పి.దానమ్మ, పి.బంగారం, పి.చిన్నబాబు, పి.రాణమ్మ, పి.మరియదాసు, లబ్ధిదారులు సంఖ్యలో పాల్గొన్నారు.

గోలి పిహెచ్‌సికు వైద్యులు కరువు!

ప్రజాశక్తి-రెంటచింతల

మండలంలోని గోలిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యులు కరువయ్యారు. ఈ ఆరోగ్య కేంద్రానికి వైద్యులు కావాలని కోరుతూ ప్రభుత్వం ఈ మధ్యకాలంలో రెండు సార్లు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందనా లేదు. ఇక్కడ ప్రాథమిక కేం ద్రానికి 261/8-1c2 సర్వే నెంబర్లు ఎకరం నర స్థలం కేటాయించారు అలాగే భవనాల నిర్మాణాల కోసం రెండు కోట్ల రెండు లక్షల కేటాయించారు. టెండర్ల దశ పూర్తయింది భవనాల నిర్మాణాలు పూర్త య్యే వరకు విలేజ్ క్లినిక్, సచివాల యంలో తాత్కా లిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వైద్య సేవల కోసం డాక్టర్ల నియామకానికి రెండుసార్లు నోటి ఫికేషన్ ఇచ్చిన ఎవరు ముందుకు రాకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతం అయినందువల్లే ఇక్కడికి వైద్యులు రావడం లేదని తెలిసింది.

ఆదర్శ కమ్యూనిస్టు మురహరిరాజు

సంతాప సభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్



సంతాప సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-నరసరావుపేట

ఆదర్శ కమ్యూనిస్టు సరికొండ మురహరిరాజు అని, ఆయన ఆశయాల సాధనకు పని చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు సరికొండ మురహరిరాజు ఈ నెల 2న అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేట ఎస్ఎస్ఎన్ కళాశాల క్రీడా ప్రాంగణం సమీపంలోని ఆయన స్వగృహం వద్ద సంతాప సభ నిర్వహించారు. సభకు సిపిఎం నాయకులు సరికొండ వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించారు. తొలుత మురహరిరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయకుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామంగా పేరొందిన రొంపిచర్లలో పార్టీ తగాదాలు, ముఠా తగాదాలు విపరీతంగా ఉండే రోజుల్లో ఆర్థికంగా చిన్న కుటుంబం అయినప్పటికీ రొంపిచర్లలో సిపిఎం శాఖ ఏర్పాటుకు ఆయన పునాది వేశారన్నారు. మాన్యం భూములను పేదలకు పంచాలనే సిపిఎం పోరాటంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. చిరు బట్టల వ్యాపారిగా వృత్తిని చేపట్టి వృత్తిలో భాగంగా ప్రతి గ్రామానికీ తిరుగుతూ విక్రయం సాగిస్తూనే పార్టీ అభివృద్ధికి చివరి వరకు కృషి చేశారని అన్నారు. సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ మురహరిరాజు క్రమశిక్షణగా మెలుగుతూ వామపక్ష భావాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేయడమే కాకుండా కుమార్తెలను కూడా పార్టీ భావజాలంతో ఉన్న వ్యక్తులకు ఇచ్చి వివాహం జరిపించారని అన్నారు. కుమారుడికి లెనిన్‌బాబుగా పేరు పెటిట్ట ఆదర్శ కమ్యూనిస్టు అయ్యారన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాల్‌రావు మాట్లాడుతూ రొంపిచర్లలో ఫ్యాక్షన్ గొడవలు ఎక్కువగా ఉన్న ఆ రోజుల్లో సిపిఎం శాఖకు పునాది వేయడమే కాకుండా వార్డు మెంబర్ గా సిపిఎం తరపున గెలిచారన్నారు. మురహరి రాజు తమ్ముడు పట్టాభి రామరాజు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తనను చదివించేందుకు తల్లిదండ్రులు సంకోచిస్తున్న సమయంలో అన్న మురహరిరాజు వెన్నుతట్టారని, ఆర్థికంగా సహాయం చేశారని, అందువల్లే తాను కళాశాలలో అధ్యాపకునిగా జీవితం సాగించానని అన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, బాపట్ల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముజుందర్, పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి ప్రసంగించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముజఫర్ అహమ్మద్, ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మురహరిరాజు అల్లుడు రాళ్ల బండి లింగరాజు, రొంపిచర్ల మండల కార్యదర్శి కె.రామారావు, జిల్లా కమిటీ సభ్యులు గుంటూరు మల్లీశ్వరి, డి.విమల,గుంటుపల్లి బాలక్రిష్ణ, టి.పెద్దిరాజు, పట్టణ శాఖ కార్యదర్శి సిలార్ మసూద్, నాయకులు ఈవూరి మస్తాన్ రెడ్డి, పాలపాడు శాఖ కార్యదర్శి కొమ్ముల నాగేశ్వరరావుపాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనలో కార్మికులు

ప్రజాశక్తి-నరసరావుపేట

నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతూ అప్కాస్‌లో చేరితే ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు వస్తాయని నమ్మించారని, ఇంజనీరింగ్ కార్మికులకు,క్లాప్ డ్రైవర్లకు 2 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇలా వేతనాలు పెండింగ్‌లో ఉండడం వలన కుటుంబ పోషణకు ప్రయివేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన రూ.6 వేలు ,హెల్త్ అలవెన్సులు, కొబ్బరి నూనె, చెప్పులు, సబ్బులు, పనిముట్లు, ఇతర రక్షణ పరికరాలు అందజేయాలన్నారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న నగర దీపికల వేతనాలు కూడా తక్షణమే చెల్లించాలని, మృతి చెందిన కార్మికుల స్థానంలో కారుణ్య నియామకం కింద కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో సమర్థవంతంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్న కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లయ్య, యోహాను, ఏసు, సమైక్యాంధ్ర ముస్లిం జెఎసి రాష్ట్ర కన్వీనర్ ఎస్.కె జిలాని మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై విస్తృత ప్రచారం

- సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో 14 నుండి రాజకీయ ప్రచారం
- 27న బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపు



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14వ తేదీ నుండి 30 వరకు సిపిఎం, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజకీయ ప్రచారంలో భాగంగా ఈ నెల 27న స్థానిక తాలూకా సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పుతుంబాక భవన్‌లో సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య ,సిపిఐ నియోజకవర్గ నాయకులు నరిసేటి వేణుగోపాల్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధిక ధరలు, పెట్రోలు, డీజిల్ , గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారాలను మోపుతోందని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను, చెత్త పన్ను పేరుతో ప్రజలపై మరిన్ని భారాలు మోపుతోందని విమర్శించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అధికారమే పరమావధిగా భావించి ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని అన్నారు.ఈ నేపథ్యంలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అందులో భాగంగానే ఈ నెల 27న స్థానిక తాలూకా సెంటర్లో జరిగే బహిరంగ సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, కట్టా శివ దుర్గారావు, గుంటుపల్లి రజిని, పెండ్యాల మహేష్, జడ రాజ్‌కుమార్, సిపిఐ నాయకులు ఇర్మియాలు పాల్గొన్నారు.



క్రోసూరులో మాట్లాడుతున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు

ప్రజాశక్తి-క్రోసూరు

స్థానిక ఆమంచి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, సిపిఐ నియోజకవర్గ నాయకులు మునగోటి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని, రాజధాని నిర్మాణానికి నిధులు ఇస్తానని పోలవరం నిర్మాణం చేపడతానని, ఇటువంటి అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా ఆంధ్ర రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ప్రజలపై భారాలు వేయడం, కార్పొరేట్ అధిపతులకు రాయి తీలు ఇవ్వడమంటే కార్పొరేట్లకు మోడీ కొమ్ముగాయడమేనని అన్నారు. ఇటువంటి విధానాలను వ్యతిరేకించాల్సిన రాష్ట్రం లోని అధికార,ప్రతిపక్ష పార్టీలు మెతక వైఖరిని అవలంబించడం తగదని అన్నారు. ఈ విషయమె ప్రశ్నించే నిమిత్తం ప్రజలను చైతన్యపరిచేందుకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాజకీయ ప్రచారం జరుగుతుందని, ఈ నెల 23న నియోజకవర్గ బహిరంగసభ జరుగుతుందని అన్నారు.సమావేశంలో సిపిఎం, సిపిఐ మండల నాయకులు టి.హనుమంతరావు, పి.నాగేశ్వరరావు, కె.పెద్దబ్బాయి, పి.యాదగిరి, పి.సత్యనారాయణ, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

అరకొర నీటితో తీరని దాహం..

- కుళాయితో వచ్చే తాగునీరు అందక ఇక్కట్లు
- గంటలు తరబడి వేచి ఉన్నా బిందెడు కష్టమే!
- ట్యాంకర్లతో అయినా సరఫరా చేయాలని కోరుతున్న స్థానికులు







ప్రజాశక్తి-తాడేపల్లి

సమయం సాయంత్రం ఏడు గంటలు... మహిళలు ఒకటే ఉరుకులు... పరుగులు... చేస్తున్న పనులు పక్కన పడేసి ఆందోళనతో చురుగ్గా అడుగులు.. చంటిబిడ్డలను వదిలేసి వడివడిగా అడుగులు... ఇది గుంటూరు, విజయవాడ కూలీల అడ్డా అనుకుంటే పొరబడినట్టే. గుక్కెడు తాగునీటి కోసం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి రన్నింగ్ రూమ్ సెంటర్‌లో కొత్త వడ్డెర కాలనీ, ఎస్‌సి కాలనీలో మహిళలు పడుతున్న తాగు నీటి కష్టాలు.

రోజులో ఒక్కపూట వచ్చే తాగునీరు కోసం మహిళలు చేసే పనిని సైతం పక్కన పడేసి గంటల తరబడి నీటి కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. దీంతో ఇక్కడ చిన్నపాటి ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి. నెల రోజుల క్రితం పైపులైన్ రిపేరు చేసినా ఇక్కడ పరిస్థితిలో తేడా లేకుండా పోయింది. కుళాయిలో వస్తున్న కొద్దిపాటి తాగునీటిని చూసి స్థానికులు ఇదేమి కార్పొరేషన్ అంటూ గగ్గోలు పెడుతున్నారు. మంగళవారం రాత్రి మున్సిపల్ వాటర్ సిబ్బందిని కార్మికులు నిలదీశారు. సక్రమంగా నీళ్లు ఇస్తారా ఇవ్వరా అంటూ అగ్రహావేశాలు వ్యక్తం చేశారు. మరోపక్క తాగునీటి కుళాయిల దగ్గర మహిళలు బిందెలతో నీళ్ల కోసం తొక్కిసలాట కొనసాగుతోంది. గంటల సమయం వెచ్చించినా తమకు తాగునీరు వస్తుందో రాదో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఇక్కడ అసలు తాగు నీరు రావడం లేదు. సాయంత్రం పూట కొద్దిసేపు మాత్రమే నీరు వస్తుంది. అప్పటిదాకా ఎండల్లో కాయకష్టం చేసి ఇంటికొచ్చిన పేదలు తాగునీటి కోసం మళ్లీ యుద్ధం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. వేసవి కాలం కావడంతో ఇక్కడ నీళ్ల కోసం పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ పనులు చేసుకుని రెక్కాడితేగానీ డొక్కాడని పేదలు తమ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పది రోజుల క్రితం స్థానిక సచివాలయంలో సిపిఎం నాయకులతో కలిసి స్థానికులు అర్జీ అందజేశారు. తాగునీరు కుళాయిల ద్వారా సక్రమంగా సరఫరా అయ్యే దాకా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన సచివాలయ అధికారులు రెండు రోజుల పాటు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. ఏం జరిగిందో తెలియదు గానీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను నిలిపివేశారు. మున్సిపల్ ట్యాపుల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే దాకా రోజూ నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యపై మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి ఆరా

కొత్త వడ్డెర కాలనీ, ఎస్‌సి కాలనీల్లో మంచినీటి ఎద్దడి తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, మాజీ ఎంపిటిసి సోలా ముత్యాలరావు ఆ ప్రాంతానికి వెళ్లారు. స్థానికులను అడిగి తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కృష్ణానది పక్కనే ఉన్నా బిందెడు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి రావడం బాధాకరమని చెప్పారు యుద్ధప్రాతిపదికన పైపులైన్లు రిపేరు చేసి పేదలకు తాగునీరు సమగ్రంగా అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. అప్పటిదాకా సాయంత్రం పూట ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని డిమాండ్ చేశారు.



పాఠశాల విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం, విద్యాభ్యాసం సాధ్యమవుతుందని మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తాలూకా బాలుర ఉన్నత పాఠశాలలో గ్లాసుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరించారు. మండల పరిధిలో రూరల్, అర్బన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాగిజావ అందించేందుకు 12800 గ్లాసులను ప్రభుత్వం పంపిణీ చేసిందని తెలిపారు. పాఠశాలల వారిగా ప్రధానోపాధ్యాయులుకు ప్రభుత్వం పంపిణీ చేసిన గ్లాసులను అందిస్తామన్నారు. జగనన్న గోరుముద్దలో భాగంగా గుడ్డు, చిక్కితో రాగిజావ అదనంగా మూడురోజులపాటు అందజేయడం జరుగుతుందన్నారు. వేసవి తాపం దృష్ట్యా వడదెబ్బ తగలకుండా విద్యార్థులకు శీతల పానీయాల కేంద్రాలను ఏర్పాటుచేయాలని దాతలను కోరారు.



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న వైసిపి నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని మెల్లంపూడి గ్రామానికి చెందిన పటాన్ సబియా గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సబియా కుటుంబ పోషణ నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక వైసీపీ నాయకుల ద్వారా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి తాడేపల్లి మండల నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి, కత్తిక రాఘవరావు, వైసిపి గ్రామ నాయకులు బొమ్మరెడ్డి రాజారామిరెడ్డి, ఈదులమూడి శేఖర్, మొగల్ జలీల్, షేక్ అలంబుడే, నాగుల మీరా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ కేశవరెడ్డి

ఇళ్లు కట్టకుంటే మరో ఏడాది ఆగాల్సిందే..

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

ఇల్లు కట్టుకునే లబ్దిదారులకు ఈ సీజన్‌లో కట్టకుంటే మరో ఏడాది ఆగాల్సి ఉంటుందని డీపీఓ కేశవరెడ్డి తెలిపారు. బుదవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు జగనన్న ఇల్లు పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు లబ్దిదారులను ఇల్లు కట్టుకునేలా మోటివేషన్ చేయాలని లేకుంటే వారు ఈ ఏడాది ఆగాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సురేష్, అర్‌డబ్ల్యూఎస్ ఎఈ వినీల్, ఎపిఎం సురేష్ లు పాల్గొన్నారు.

వివిఐటిలో 'నిన్నటి పరిమళాలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి తదితరులు

ప్రజాశక్తి- తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నంబూరు కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మేనేజ్మెంట్ అంశంపై నిర్వహించిన సదస్సులో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సులో 163 కళాశాలలకు చెందిన విద్యార్థులు వారి పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వివిఐటి 24వ ప్రచురణ ప్రముఖ కథా రచయిత శ్రీ రమణ రచించిన 'నిన్నటి పరిమళాలు' పుస్తకాన్ని హేమచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీర్లలో నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకత అవసరమన్నారు. అవి సదస్సులు, వర్క షాపులు, ఇంటర్నెట్ షిప్ ద్వారా పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు ఉన్నత విద్యా మండలి తమ వంతు కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కూడా 'టాక్ టు బుక్' కార్యక్రమం ద్వారా యువ రచయితలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అబ్సల్యూట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మాదాసు పాపారావు, వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున రెడ్డి, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ కె. గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్ కుమారస్వామి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి రామచంద్రన్, అధ్యాపకులు పాల్గొన్నారు

మానసిక, శారీరక వికలాంగులను ఆదరించండి..



ఎపి కాస్ట్ ప్రతినిధి డాక్టర్ వై.అపర్ణను ఘనంగా సత్కరించిన కెఎల్ యు వైస్ చైర్మన్ కోనేరు రాజాహరీన్

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

మానసిక, అంగవైకల్యం ఉన్న వారిని చులనకన చేసి చూడొద్దని,వారిని ఆదరించాలని కెఎల్ విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ కోనేరు రాజాహరీన్ అన్నారు. బుదవారం వర్శిటీలోని న్యూ సెమినార్ హాలులో జరిగిన ఆటిజం (మానసిక అంగవైకల్యం) అనే అంశంపై అంతర్జాతీయ ఒక రోజు కార్యశాలలో ఆయన విద్యార్థులు, తల్లి దండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ఏప్రిల్ నెలను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆటిజం వారోత్సవాల నెలగా తాము ఈ నెలలో ఈ ఆటిజం అంతర్జాతీయ సదస్సును తమ నిర్వహించామన్నారు. త్వరలో కెఎల్‌యులో ఆటిజం (మానసిక అంగవైకల్యం) కలిగిన బాల బాలికల కోసం ప్రత్యేక థెరఫీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. సదస్సు కన్వీనర్ అధ్యాపకులు డాక్టర్ వసుజాదేవి అధ్యక్షత వహించాగా ప్రపంచ వ్యాప్తంగా మానసిక రోగులకు విశిష్ట సేవలను అందిస్తున్న బెంగళూరులోని నిమ్ హాన్స్ వైధ్యాధికారి, మానసిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిమా మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం డాక్టర్ ప్రతిమా మూర్తి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు పలు దేశాలలో మానసిక రోగులకు వైద్య సేవలందించడమే కాక అనేక మందికి శిక్షణ కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రో చాన్సులర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ ఆటిజమ్‌కు సాధ్యమయ్యే చికిత్స మరియు పిల్లలలో అత్యుత్తమ ప్రతిభను వెలికితీయడం గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రతిమామూర్తి, డాక్టర్ టి.వెంకటేశ్వరులు, ప్రొఫెసర్ వై.అపర్ణ తదితరులను సన్మానించారు. వివిధ పాఠశాలలకు చెందిన ఆటిజం పిల్లలు డ్యాన్స్, ఆటలు, క్విజ్, డ్రాయింగ్‌లు మొదలైన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఉత్తమ పాల్గొనేవారికి ప్రీస్ మరియు కాంప్లిమెంటరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కెఎల్‌యు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. రాజా హరీన్, ప్రొ.కె.ఎస్.జగన్నాథరావు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రారంభం



నాగేంద్ర చౌదరిని సత్కరిస్తున్న ఆచార్య మనోజ్ కుమార్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఉద్యోగంతో పాటు వివిధ వృత్తుల్లో రాణిస్తూ ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారి కోసం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సరికొత్త పీజీ కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రఖ్యాత టైమ్స్ ప్రో పోర్టల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వీ నాగేంద్ర చౌదరి పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఏపీఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఎగ్జిక్యూటివ్ మాస్టర్స్ బిజినెస్. కోర్సు(ఈఎంబీఏ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు.పారి బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ భరద్వాజ్ మాట్లాడుతూ ఈ కోర్సులో మార్కెటింగ్, ఫైనాన్స్, హెచార్ వంటి ప్రాధాన్యత గల స్పెషలైజేషన్లు ఉంటాయన్నారు.ఏపీ ఎస్ఆర్ఎం వెబ్సైట్లో ధరకాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు 'అమేయ' పేరుతో జరిగే బిజినెస్ ఫెస్టును డాక్టర్ నాగేంద్ర ప్రారంభించారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమకుమార్‌లు ముఖ్య అతిథి డాక్టర్ నాగేంద్రను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో డీన్ డాక్టర్ భరద్వాజ్ కోర్సు వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కంట్రోలర్ డాక్టర్ వినాయక్, సీపీవో సుమ, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ పంకజ్ పాల్గొన్నారు.

పల్నాడుకు 'ఇబిసి నేస్తం' లబ్ధి రూ 55.095 కోట్లు

ప్రజాశక్తి-నరసరావుపేట

రాష్ట్రవ్యాప్తంగా వై.ఎస్.ఆర్. ఇ.బి.సి. నేస్తం పథకం రెండో విడత నగదు జమ లబ్ధి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా వెనుక బడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన 'ఇ.బి.సి. నేస్తం' పథకం ద్వారా రూ.55.095 కోట్లను 36,730 మంది లబ్ధి దారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం ద్వారాతొలి ఏడాది 2021-2022 ఆర్థిక సంవత్సరం నుంచి పల్నాడు జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువనున్న ఇ.బి.సి. మహిళల్లో 45 నుంచి 60 ఏళ్ల వయసు గల వారికి ఆర్థిక సాయం అందించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇ.బి.సి. కార్పోరేషన్ ద్వారా ఏడాదికి రూ.15,000 చొప్పున మూడేళ్లకు గాను రూ.45,000 ప్రభుత్వం అందిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. 2021-2022 ఏడాదిలో పల్నాడు జిల్లాలో 32,393 మందికి, రూ.48.50 కోట్లను తొలి విడతలో ప్రభుత్వం అందించినదని అన్నారు. మొత్తం రెండు విడతల్లో పల్నాడు జిల్లా నుంచి 69,123 మంది ఐ.బి.సి. మహిళల ఖాతాలకు రూ.103.685 కోట్లను జమ చేశామన్నారు. అంతక ముందు లబ్ధి దారులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్ల కలిగే మేలు లబ్ధిదారులకు ఏ విధంగా ఉపయోగ పడుతోందో వారిని అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులను అడిగి తెలుసు కొని వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా బి.సి.వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వర్లు, నరసరావుపేట పట్టణ ఐ.బి.సి. మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ శివశంకర్

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని రుద్రవరం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదం సంభవించి ఇళ్ళు దాచుకున్న డబ్బులు కోల్పోయిన అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సోసైటీ ఆసరగా నిలిచింది.కలెక్టర్ శివశంకర్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి, సత్తైనపల్లి రెడ్ క్రాస్ బ్రాంచి సభ్యులు అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి వంటపాత్రలు ,దుప్పట్లు,టార్పాలిన్ పట్టాలు,హైజీన్ కిట్స్, కొన్ని నిత్యావసర వస్తు సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో తహాశీల్దార్ శ్రీ భవాని శంకర్ వీఆర్వో బి రోశయ్య , బత్తుల మురళి,శ్రీనివాస గుప్తా, ఆంజనేయులు చంద్ర శేఖర్, కోటేశ్వరరావు,రత్నం,భుజంగరావు పాల్గొన్నారు.



నిరుద్యోగ సమస్యలపై పోరాడండి

ప్రజాశక్తి - వినుకొండ

శాసనమండలిలో నిరుద్యోగ సమస్యలపై చర్చించి పరిష్కార దిశగా పోరాడాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అన్నారు. బుధవారం వినుకొండకు వచ్చిన తూర్పు రాయలసీమ ఎమ్మెల్సి కంచర్ల శ్రీకాంత్‌ను జీవి ఆంజనేయులు, టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఎమ్మెల్సి కంచెర్ల శ్రీకాంత్ వినుకొండ కి రావడం ఎంతో ఆనందంగా ఉందని, గెలుపులో మంచి మెజార్టీ సాధించారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనకు ఒక ముగింపు ఎలా ఉంటుందో చూపించారన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుకున్న విద్యావంతులు,నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు ఈ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు.

నీటి కోసం టిడిపి ధర్నా

ప్రజాశక్తి-నకరికల్లు



ప్రభుత్వం సాగర్ కుడి కాలువ ద్వారా గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేయక పోవడంతో టిడిపి ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు డాక్టర్ కోడెల శివరాం మండలం లోని అడ్డోడు వద్ద నీటి కోసం ధర్నా, రైతుల కోసం పోరాటం కార్యక్రమం నిర్వహించారు.

పైలాన్ వద్ద జనసేన నిరసన

ప్రజాశక్తి-నకరికల్లు

సాగర్ ఆయకట్టు పరిధిలోని లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో గోదావరి,పెన్నా నదుల అనుసంధానం మొదటి దశ పనుల పైలాన్ ను ప్రారంభించి ఐదే ళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని జనసేన పార్టీ నాయకులు విమర్శలు చేశారు. జనసేన ఆధ్వర్యంలో పైలాన్ వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని, లేని పక్షంలో ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఎఎస్‌పి బిందుమాధవ్‌కు ప్రమోషన్
ఘనంగా సత్కారించిన ఎస్పీ

ప్రజాశక్తి-నరసరావుపేట

ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళుతున్న పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) జి. బిందుమాధవ్ ను పల్నాడు జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి, జిల్లా పోలీస్ అధికారులు బుధవారం ఘనంగా సన్మా నించారు. 2017 ఆర్.ఆర్ ఐ.పి.ఎస్ బ్యాచ్ కు చెందిన గరక పాటి బిందుమాధవ్ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్. ఈ.బి జాయింట్ డైరెక్టర్‌గా, అనంతరం నూతన పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వహిస్తూ, ఎస్పీగా ఉద్యో గోన్నతి పొంది గ్రేహౌండ్స్ ఎస్పీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో బిందుమాధవ్ ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన పల్నాడు జిల్లాకు అదనపు ఎస్పీ(పరిపాలన)గా విశేష సేవలందించి, జిల్లా శాంతిభద్రతల పరి రక్షణలో, పరిపాలనలో తమకు సహాయసహకారాలు అందించినం దుకు కృతజ్ఞతలు తెలిపారు. బిందుమాధవ్ తన వృత్తి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఆయన ప్రయాణించే వాహ నానికి ఇరువైపులా నిలబడి, గౌరవ ప్రదంగా ఎస్పీకి వీడ్కోలు పలికారు. వినుకొండ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తూ సాధా రణ బదిలీల్లో భాగంగా బదిలీ అయిన రమేష్ బాబును పల్నాడు ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు. పల్నా డు జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్రరాజు,పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ రెడ్డి,డిఎస్పీలు,సీఐలు,జిల్లా పోలీస్ కార్యాలయ ఎఒ రామారావు పాల్గొన్నారు.



బిందు మాధవ్ ను సన్మానిస్తున్న పల్నాడు ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

బిందు మాధవ్ ను సన్మానించిన కలెక్టర్

కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బిందుమాధవ్‌ను కలెక్టర్ శివశంకర్ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



టిడిపి అధినేత చంద్రబాబును కలిసిన ఇబ్రహీం కుటుంబ సభ్యులు


ప్రజాశక్తి-నరసరావుపేట

కొన్ని నెలల క్రితం నరసరావుపేట పట్టణంలో హత్య గురైన టిడిపి కార్యకర్త ఇబ్రహీం కుటుంబ సభ్యులు నారా చంద్రబాబునాయుడు కలిసి ఇంటి పెద్దను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. నరసరావుపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించి తన కుటుంబానికి అండగా ఉన్నారని తెలిపారు. ఇబ్రహీం కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చంద్రబాబు వారికి భరోసా ఇచ్చారు.

ప్రతిరోజూ ఐదుగురికి కరోనా పరీక్షలు

ప్రజాశక్తి -రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతల లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు ఐదు గురికి కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఇప్పటివరకు 151 మందికి ఈ పరీక్షలు నిర్వహించామని, రిపోర్టుల్లో ఎవరికి కరోనా లేదని తెలిపారు.



22 మందికి సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సీఎం సహాయ విధి చెక్కులు అందజేశారు. నియోజకవర్గ పరిదిలోని 22 మంది బాధితులకు వచ్చిన 18 లక్షల 81 వేల రూపాయల సీఎం ఆర్థిక సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలను ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరిగిం దన్నారు. ఆరోగ్య శ్రీ అనుమతులు ఉన్న వైద్యశాలలోనే చికిత్స చేయించుకోవాలని అన్నారు. ఆరోగ్యశ్రీ ఉండి కూడా ఆసుపత్రి యాజమాన్యం వారు నగదును డిమాండ్ చేస్తే తమ దష్టికి తీసుకొని రావాలని కోరారు. వినుకొండ టౌన్ రూ. 8,20,000, వినుకొండ రూరల్ రూ.1,10,000, నూజెండ్ల రూ.65,000, బొల్లాపల్లి రూ. 4,12,000, ఈపూరు రూ. 3,04, 000, శావల్యాపురం రూ.1,70, 000 చెక్కులను లబ్ధిదారులకు అంద జేశారు.

రైల్వే సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి

- పిడుగురాళ్లలో లేదా నడికుడి స్టేషన్‌లో వందేభారత్ రైల్‌ను ఆపండి
- సికింద్రాబాద్- గుంటూరు మధ్యలో రెండో ట్రాక్‌ను అభివృద్ధి చేయండి
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపి శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి

ప్రజాశక్తి-నరసరావుపేట



పల్నాడు జిల్లాలో రైల్వే సమస్యల పరిష్కారం కోరుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం ఢిల్లీలో కలసి వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్- తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను పల్నాడులో ఎంతో ముఖ్యమైన పిడుగురాళ్ల లేదా నడికుడి స్టేషన్‌లో ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు స్టేషన్‌ల నుండి ప్రయాణీకులు, వ్యాపారస్తులు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారని తెలిపారు.

పల్నాడు జిల్లాలో పర్యాటక, వ్యాపార ప్రయాణాలను ఆకర్షించడం ద్వారా ఆర్థికాభివృద్ధిని ప్రోత్స హించాలని మంత్రికి తెలి పారు. సికింద్రాబాద్ నుండి తిరుపతి వరకు వందేభారత్ రైల్‌ను ప్రారంభించాలని చేసిన విన్నపం మేరకు రైలు ప్రారంభించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్‌లో ఆగే కొన్ని రైళ్లుప్రస్తుతం ఆగటం లేదని, కోవిడ్ సమయంలో కొన్ని రైళ్ళు నిలుపుదల తీసివేయడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవతున్నారని తెలపారు. నారాయణాద్రి, లింగంపల్లి, హైదరాబాద్ సూపర్ ఫాస్ట్, సికింద్రాబాద్, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లను గతంలా పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకుల సౌలభ్యం కోసం సికింద్రాబాద్,గుంటూరు మధ్య రెండవ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తన వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

కుల వ్యవస్థ లేని సమాజమే పూలే ఆశయం

ప్రజాశక్తి-తాడేపల్లి
సమాజంలో అంటరానితనం, కుల వ్యవస్థ లేని సమాజ నిర్మాణమే జ్యోతిరావు పూలే ఆశయమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.భాస్కరయ్య అన్నారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతి ఉండవల్లిలో నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగాలని, అన్ని కులాల మధ్య సత్సంబంధం ఉండాలని పూలే అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన భార్య సావిత్రిబాయి పూలే దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా అందరికీ విద్యనందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మన ముందున్న కర్తవ్యమని చెప్పారు. నేడు బిజెపి ఫాసిస్టు పాలన నేపథ్యంలో ఇది అత్యంత ఆవశ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, ఈమని రామారావు, ఈశ్వరరెడ్డి, భక్తిరెడ్డి, శివయ్య, సారథి, టి.గాంధీ, మస్తానయ్య పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్ : ఎయిడ్స్ మహమ్మారితో బాధపడుతున్న 200 మంది భాధితులకు పాత పొన్నూరు అంబేద్కర్ భవనంలో ఫ్రైజ్ అడోనియా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 కేజీల పోషకాహారం కిట్లును ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగదీశ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బుస్సా సూరిబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ బాబు, జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు గూడవల్లి గంగాధర్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అమత, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు బుద్దులూరి రంగారావు,ట్రస్ట్ చైర్మన్ పి. విజయభాస్కర్, వేణు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి- మంగళగిరి
పట్టణంలోని టిడ్కో గృహ సముదాయంలో రూ.7 కోటలతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విద్యుత్ శాఖ ఎస్ఈ విజయ్ కుమార్‌తో కలిసి టిడ్కో సముదాయంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ శ్లాబు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలోని పేదలకు మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సిఐటియు నాయకులు అచ్చిరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి
సీతానగరం పిడబ్ల్యు వర్కుషాపులో సిఐటియు యూనియన్ నాయకునిగా కార్మికుల హక్కుల కోసం పని చేసిన తక్కెళ్లపాటి అచ్చిరెడ్డి ధన్యజీవి అని సిపిఎం జిల్లా సీనియర్ నాయకలు జొన్నా శివశంకరరావు నివాళు లర్పించారు. అచ్చిరెడ్డి ఐదో వర్ధంతి సభ ఉండవల్లి సిపిఎం కార్యాలయంలో సిహెచ్.సుందరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ అచ్చిరెడ్డి కార్మికవర్గ దృక్పథంతో పని చేయడంతో పాటు స్థానిక నివాసం ఉండే ప్రాంతంలో సిపిఎం అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఎన్నికల సందర్భంగా సిపిఎం అభ్యర్థుల గెలుపు కోసం పని చేశారన్నారు. సిపిఎం కార్యకర్తలు మరింత అకుంఠ దీక్షతో ప్రజల కోసం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో



నివాళులర్పిస్తున్న జొన్నా శివశంకరరావు , నాయకులు

నాయకులు కె.జగదీశ్వర్‌రెడ్డి, టి.భక్తిరెడ్డి, యు.పార్థసారథి, ఎస్.వెంకటనారాయణ, శివయ్య, మస్తానరావు, టి.గాంధీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా అచ్చిరెడ్డి చిత్రపటానికి సిపిఎం నాయకులు వి.వెంకటేశ్వరరావు, ఈమని రామారావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-దుగ్గిరాల
జొన్న,మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మండల డిప్యూటీ తహశీల్దార్ కె. కళ్యాణికి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ మండలంలో జొన్న 3200 ఎకరాలు, మొక్కజొన్న 12400 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారని తెలిపారు. పంటలు రాకముందు మొక్కజొన్న ధర రూ. 2,200లు ఉందని పంటలు చేతికి వచ్చే దశలో రూ.1800లకు కొనుగోలు చేస్తున్నారు. జొన్న పంట ధర రూ.2900లు ఉండగా ప్రస్తుతం రూ.2300లకు కొనుగోలు చేస్తున్నారని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకి ఆర్‌బి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కేల ద్వారా పంటలు మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ఎన్.యోగేశ్వరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, రైతు సంఘం జిల్లా నాయకులు వి. సాంబశివరావులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

మర్కజ్ మసీదుకు విరాళం

ప్రజాశక్తి-తెనాలి
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక 18వ వార్డులోని మర్కజ్ మసీదుకు రూ.లక్ష విరాళాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మర్కజ్ మసీదుకు విరాళాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి టిడిపి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో షేక్ రఫి, షేక్ కరిముల్లా, ఖాజా, బాజి, సిద్దిక్, నాయకులు మహ్మద్ ఖుద్దూస్, నాసర్ అహ్మద్, జిలాని, రహంతుల్లాభేగ్, ఫిరోజ్, ముస్తఫా పాల్గొన్నారు.



గొడుగుల పంపిణీ చేస్తున్న కొత్తమాసు కుమార్

చర్మకారులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి: సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం చర్మకారులకు ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. దాదాపు రూ.2500 విలువ చేసే గొడుగులను చర్మకారులకు ఉచితంగా అందజేయటం అభినందనీయమని, సామాజిక కేంద్రం నిర్వాహకులు తన్నీరు శివశంకర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాలేపాటి హేమకుమార్, పి.రవికుమార్, ఎం.రమణయ్య, సిహెచ్ భానుప్రసాద్, అడపా సంపత్‌రాయుడు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న డిఎస్‌పికె. స్రవంతిరాయ్

హోంగార్డ్ దేవకుమార్ కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-తెనాలి
ఇటీవల మృతి చెందిన హోంగార్డ్ దేవకుమార్ కుటుంబానికి పట్టణ ఒన్ టౌన్ పోలీసులు బాసటగా నిలిచారు. సిఐ కె.చంద్రశేఖర్ నేతృత్వంలో సిబ్బంది రూ.64వేలను సేకరించారు. ఈ మొత్తాన్ని డిఎస్‌పి కె.స్రవంతిరాయ్ చేతుల మీదుగా దేవకుమార్ కుమారునికి బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో అదించారు. దేవకుమార్ కుటుంబానికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చిన సిబ్బందిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో సిఐ కె.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను హరిస్తున్న బిజెపి

ప్రజాశక్తి-తెనాలి
కేంద్రంలోని బిజెపి సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తుందని పత్రిక స్వేచ్ఛను సైతం హరించి వేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డు బీసీ కాలనీలోని పట్టణ రంగస్థల కళాకారుల సంఘం భవనంలో ఏపీ ప్రజానాట్యమండలి, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కళాకారుల శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ముగింపు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ వరుసగా రెండుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి రైతులు ,కార్మికుల హక్కులను హరించి వేస్తుందన్నారు. చివరకు ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల పైన కూడా ఆంక్షలు విధించిందన్నారు. దీనికి తోడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పలుకుతూ రాష్ట్ర ప్రయోజనాలను మంట గలిపారన్నారు. నిరంకుశ దోరణిని అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపేందుకు 21 ప్రతిపక్ష పార్టీలు ఏకమయ్యాయని, వాటికి మద్దతుగా నిలుస్తామన్నారు. తమ నినాదం ఒకటేనని కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ సర్కార్‌కు చరమగీతం పాడాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మణరావు, ఇఫ్టా జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య, జిల్లా కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తదితరులున్నారు పాల్గొన్నారు.



పౌరాణిక కళాకారుడు సత్యన్నారాయణకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్
మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో బుధవారం ఎన్టీఆర్ నటించిన మాయాబజార్ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కళాకారులను సత్కరించే కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు, రేడియో ఆర్టిస్ట్ అన్నిశెట్టి సత్యన్నారాయణను జగ్గడిగుంటపాలెం పార్టీ నాయకులు ఖగ్గా గోపి, దాసరి సాంబశివరావు, బూర మల్లేష్, తాడిపర్తి మహేష్, గంగా మణికంఠ, కాటం రవికుమార్, సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటీ సభ్యులు పి. పోతురాజు, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, డి.భవాని, ఎన్టీఆర్ జగన్, ఎం. రాఘవరావు, డి.భాస్కర్, జి. ప్రసాద్, ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



3 వేల మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్: పెదనందిపాడులో కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్‌వారు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడం హర్షినియమని విజ్ఞాన సంస్థల అధినేత పిఎఎస్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు.బుధవారం పెదనందిపాడు కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సభకు రోటరీ క్లబ్ జిల్లా సభ్యులు పోపూరి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. శిబిరంలో వైద్యులు 3వేల మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి తమ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండి స్వైరారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జి. సుబ్బారావు, తదితరలు పాల్గొన్నారు. అనంతరం హాస్పిటల్ ఎండి కాటూరి సుబ్బారావు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలి

ప్రజాశక్తి- మంగళగిరి:కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు అన్నారు. బుధవారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా 16వ మహాసభ జరిగింది. ఈ సభకు అధ్యక్ష వర్గంగా ఏ అరుణ్ కుమార్, సిన్ని సత్యనారాయణ, పి సత్యనారాయణ వ్యవహరించారు. ఓబులేసు మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉండి సాధించుకున్న హక్కులను, కార్మిక చట్టాలను కాలరాస్తున్నారని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి రాధాకృష్ణమూర్తి, సిపిఐ రాష్ట్ర నాయకులు జే.అజయ్ కుమార్, చిన్ని తిరుపతయ్య, నియోజవర్గ నాయకులు జె. జాన్ బాబు, నందం బ్రహ్మేశ్వర రావు పాల్గొన్నారు.

నేడు తుమ్మలపాలెం అమరవీరుల స్మారక సభ

ప్రజాశక్తి - యడ్లపాడు

తుమ్మలపాలెం అమరవీరుల స్మారక సభ గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తుమ్మలపాలెం అమరవీరుల స్మారక ట్రస్టు తెలిసింది. ఈ మేరకు ట్రస్టు కన్వీనర్ చెరుకూరి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దన్నుగా ఆంధ్రప్రాంతంలో జరిగిన పోరాటంలో మరణించిన ఆరుగురు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ క్రూరత్వానికి బలైన మరో 17 మంది, శ్రీకాకుళంలో గిరిజన ఉద్యమానికి బాసటగా నిలిచిన అమరులైన జిల్లాకు చెందిన మరో 10 మంది స్మృత్యర్థం తుమ్మలపాలెంలో అమరవీరుల స్థూపాలను నిర్మించారు. 1997లో వీటిని పునర్‌నిర్మించి అన్ని కమ్యూనిస్టు పార్టీలూ కలిసి స్మారక సభను ప్రతిఏటా నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా తుమ్మలపాలెంలోని అమర్‌నగర్‌లో గురువారం నిర్వహించే సభకు ముఖ్య ఉపన్యాసకులుగా సిపిఎం, సిపిఐ పల్నాడు



జిల్లా కార్యదర్శులు గుంటూరు విజయ్‌కుమార్, ఎ.మారుతి వరప్రసాద్, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు ఎం.లక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

పింఛను కోసం రాజధాని పేదల ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



రాజధాని గ్రామాల్లో పేదలకు ఇవ్వాల్సిన పింఛన్లను 12 రోజులు దాటినా ఇవ్వకపోవడంతో లబ్ధిదార్లు బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. నిడమర్రులోని 2వ నంబరు సచివాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ నిడమర్రులో 1742 మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా 808 మందికే ఇచ్చారని, మిగిలినవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పటికే రాజధాని గ్రామాల్లో పనుల్లేక సామాన్యులు, పేదలు ఇబ్బంది పడుతున్నారని, వారికిస్తున్న కొద్దిపాటి పింఛను కూడా సమయానికి ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆవేదన వెలిబుచ్చారు. నిలిచిన పింఛన్లలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులు కూడా ఉన్నారని, వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే సామాజిక పింఛనును రూ.5 వేలు చేస్తామని హామీనిచ్చిన వారు దాన్ని నెరవేర్చకపోగా ఇస్తున్న దాన్ని కూడా సమయానికి ఇవ్వడం లేదని విమర్శించారు. గతంలో మూడు నెలల పెండింగ్‌లో పెట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పింఛను సొమ్మును వెంటనే విడుదల చేయాలని కోరారు. ధర్నాలో నాయకులు జి.నాగేశ్వరరావు, సునీత, వెంకాయమ్మ, కె.సుమతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ విస్తరణకు పోరాటం ఉధృతం

- 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- రైతు, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగింపునకు సమైక్యంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని రైతు, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. నిధుల కేటాయింపు డిమాండ్‌తో ఈ నెల 15న ఉదయం 10 గంటలకు గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని సమావేశంలో తీర్మానించారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కుర్రా హరిబాబు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వివిధ రైతు సంఘాల నాయకులు పాల్గొని గుంటూరు ఛానల్ విస్తరణ ప్రాధాన్యతను తెలియజేస్తూ, పాలకులు నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఆయా ప్రాంతాల భూములు ఉప్పునీటితో తడుపుకోవాల్సి వస్తుందని, ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే కాలంలో ఆప్రాంత



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

భూములు సాగుకు పనికిరాకుండా పోయతాయని ఆందోళణ వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, విస్తరణ పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ నీరున్న చోటే అభివృద్ధి ఉంటుందని, గుంటూరు ఛానల్ విస్తరణతో ఆప్రాంతంలోని 50 వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతుందని అన్నారు. సాగునీరు అందుబాటులో ఉంటే రైతులు రెండు, మూడు పంటలు వేసుకోవటానికి అవకాశం ఉంటుందని, ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే రూ.2.70 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో గుంటూరు ఛానల్ విస్తరణకు అవసరమైన రూ.274 కోట్లు విడుదల చేయటం పెద్ద సమస్య కాదని అన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో అవసరమైతే ఆయా మండలాల్లోని గ్రామాల్లో బంద్ నిర్వహించటానికీ పోరాట కార్యాచరణ రూపొందించుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ విస్తరణకు పిడిఎఫ్ కూటమి మొదటి నుండి సానుకూలంగా ఉందని, అవకాశం ఉన్న అన్ని వేదికలపైనా తమ గళాన్ని వినిపిస్తున్నామని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం కొద్దిమేర కదలిక వచ్చి, గుంటూరు జిల్లా కలెక్టర్ భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. బాపట్ల జిల్లాలోని పర్చూరు మండలానికీ నోటిఫికేషన్ విడుదల చేయాలని బాపట్ల కలెక్టర్‌ను కోరారు. నోటిఫికేషన్ ఇచ్చినా అందుకు అవసరమైన రూ.113 కోట్లను బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. దీంతో భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగట్లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో అతి సమీపంలోనే నదులు, రిజర్వాయర్లున్నా అనేక ప్రాంతాలు తీవ్రమైన నీటిఎద్దడి ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి గుంటూరు ఛానల్ విస్తరణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శివ, తెలుగు రైతు రాష్ట్రనాయకులు తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, నల్లమడ రైతు సంఘం నాయకులు లావు నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, కౌలు రైతు మువ్వా పెద్దన్న, పర్చూరు మండలం బూడవాడ సర్పంచ్ కె.బాపూజి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కష్ణకాంత్, సిఐటియు నాయకులు కె.నళినీకాంత్ ప్రసంగించి మద్దతు పలికారు.

రాజకీయాలకు అతీతంగా పోరాటం

నాటి కమ్యూనిస్టు నాయకులు కొల్లా వెంకయ్య కృషితో నల్లమడ రైతు సంఘం నాయకత్వంలో రాజకీయాలతో నిమిత్తం లేకుండా దశల వారీ ఐక్య ఉద్యమాల ద్వారా గుంటూరు ఛానల్ పొడిగింపు చర్చ విస్తృతంగా జరిగింది. ఛానల్ విస్తరణ పరిధిలో ఉన్న మండలాల్లోని ప్రజలను కదిలించి పెద్ద ఉద్యమాన్ని నిర్మించి గుంటూరు ఛానల్ పొడిగింపుకు నిధులు సాధించుకోవాలి.



పాశం రామారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు.

బ్రిటీషు కాలం నుండీ హామీలే

బ్రిటీషు కాలం నుండి గుంటూరు ఛానల్ విస్తరణకు పాలకులు హామీలే ఇస్తున్నారు. ఆచరణ రూపం దాల్చట్లేదు. ఈ ప్రాంత పంటలు పూర్తిగా వర్షాధారం పంటలు. గత టిడిపి, ప్రస్తుత వైసిపిలు కూడా నిధులు హామీలే ఇచ్చాయి. దీంతో విస్తరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. తక్షణమే పాలకులు స్పందించి, నిధులు విడుదల చేయాలి.



హరిబాబు, నల్లమడ రైతు సంఘం నాయకులు.

రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలి

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతుల సమస్యలపై రాజకీయాలకు అతీతంగా సంఘాలన్నీ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. తెలుగు రైతు సంఘం గుంటూరు ఛానల్ విస్తరణకు పూర్తి మద్దతు ఇస్తుంది. రాబోయే ఎన్నికల్లో గుంటూరు ఛానల్‌ను విస్తరించే వారికే ఓటు అని ప్రజలు అనే విధంగా చైతన్యం రావాలి. ప్రస్తుత ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోంది. కనీసం కాల్వల్లో గుర్రపుడెక్క కూడా తొలగించట్లేదు.



కళ్లం రాజశేఖర్‌రెడ్డి, తెలుగు రైతు అధ్యక్షులు

పోరాటాన్ని ఉధృతం చేయాలి

నల్లమడ వాగు, గుంటూరు ఛానల్ విస్తరణకు నల్లమడ రైతు సంఘం, ఇతర వామపక్షాలు సాగిస్తున్న సుదీర్ఘ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని గుంటూరు ఛానల్ విస్తరణకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలి. రాజకీయాలకు అతీతంగా సంఘాలన్నీ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉంది.



మన్నవ హరిప్రసాద్, సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ పొలిట్‌బ్యూరో సభ్యులు.

ప్రజా పోరాటాలతోనే నిధులు

రూ.రెండు లక్షలకు పైగా ఉన్న రాష్ట్ర బడ్జెట్‌లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఒక సాగునీటి ప్రాజెక్ట్ కోసం రూ.200 కోట్లు కేటాయించలేకపోవటం బాధాకరం. ప్రభుత్వం దిగి వచ్చేదాకా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి. ప్రజా పోరాటాలతోనే ప్రభుత్వం దిగి వస్తుంది.



లావు అంకమ్మ చౌదరి, కాంగ్రెస్ రైతు సంఘం నాయకులు.

పోరాటానికి సంపూర్ణ మద్దతు



గుంటూరు ఛానల్ విస్తరణకు సుదీర్ఘకాలంగా జరుగుతున్న ఉద్యమానికి తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాం. రాబోయే కాలంలో జరిగే ఉద్యమాల్లో రైతులకు అండగా పోరాటంలో పాల్గొంటాము.

కాల్వ శ్రీధర్, రైతు కూలి సంఘం నాయకులు.

సుదీర్ఘ పోరాటం స్ఫూర్తిదాయకం



రైతుల సమస్యలపై దశాబ్దాలుగా నల్లమడ రైతు సంఘం, వామపక్షాలు, రైతులు సుదీర్ఘ పోరాటం కొనసాగించటం స్ఫూర్తిదాయకం. నేటి తరం నాయకులు ఇదే స్ఫూర్తితో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలి.

కోటేశ్వరరావు, ఏరువాక రైతుకూలి సంఘం నాయకులు.

ప్రజా ఉద్యమం నిర్మించాలి



ఛానల్ విస్తరణ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజల్ని ఐక్యం చేసి, ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో చైతన్యం తెచ్చి పోరాడాలి. దీనికోసం సంఘాలు, పార్టీలు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి.

నరిశేటి ఆచారి, నల్లమడ రైతు సంఘం నాయకులు.